క్లుప్తంగా

మెనూ చార్జీలు పెంచాలి

రాయచోటి అర్బన్ : ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి.భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం మధ్యాహ్నం యూటీఎఫ్ కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రవాణా చార్జీలు చెల్లించనందున ఇకముందు బియ్యంతోపాటు ఇతర సామగ్రిని డీలర్ల వద్ద నుంచి ప్రభుత్వమే పాఠశాలలకు చేర్చాలన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరల నేపథ్యంలో ప్రతి విద్యార్థికి మెనూ చార్జీని రూ. 8 నుంచి రూ. 20కి పెంచాలన్నారు. కార్మికులకు వెంటనే గుర్తింపు కార్డులను ఇవ్వడంతోపాటు నాలుగు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నేతలు రఫీ, అక్బర్, లక్ష్మీదేవి, రెడ్డెమ్మ, అనసూయతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలకు విద్యార్థిని ఎంపిక

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని శ్రీ రీషి అప్పర్ ప్రైమరీ పాఠశాలలో చదువుతున్న మదనపల్లె చంద్రిక క్రీడా పాఠశాలకు ఎంపికైందని పాఠశాల కరస్పాండెంట్ టి.యువరాజు తెలిపారు. గురువారం క్రీడా పాఠశాలకు ఎంపికైన విద్యార్థిని చంద్రికను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించి సన్మానించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు చంద్రికను అభినందించారు. తల్లిదండ్రులకు మెమెంటోను అందజేశారు. కార్యక్రమంలో హెడ్‌టీచర్ దామోదరవలి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నివాళి

నందలూరు(రాజంపేట) : నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ వేల్పుల లక్ష్మీదేవి మృతదేహానికి గురువారం రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శించిన వారిలో నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ భూమన శంకర్‌రెడ్డి, సర్పంచ్ జంబు సూరి, అన్నం నాగేంద్ర, జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శి సయ్యద్ అమీర్, నాయకులు ఆకేపాటి జగదీశ్వరరెడ్డి, ఆకేపాటి రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు శిక్షణ

చిట్వేలి : 30వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కల్నల్ రాజకుమార్ ఆదేశాల మేరకు ఎన్‌సీసీ శిక్షణను స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం నుంచి ఎన్‌సీసీ శిక్షణను ప్రారంభించినట్లు ఎన్‌సీసీ అధికారి పి.రాజశేఖర్ తెలిపారు. గురువారం కడప నుంచి వచ్చిన హవల్‌దార్లు సమయ్ సింగ్, ప్రకాష్ ప్రమోద్‌లతో కలిసి ఉదయం డ్రిల్, మ్యాప్ రీడింగ్ అంశాలపై సాయంత్రం డ్రిల్, కంపాస్లపై అవగాహన కల్పించామని ఎన్‌సీసీ అధికారి రాజశేఖర్ తెలిపారు. శిక్షణలో ఎన్‌సీసీ బాలబాలికలు పాల్గొన్నారు.

పిల్లలకు ఆట బొమ్మలు, గ్లాసులు, ప్లేట్లు వితరణ



అంగన్‌వాడీ కార్యకర్తలకు సామగ్రిని అందజేస్తున్న దృశ్యం

వీరబల్లె (రాయచోటి టౌన్) : వీరబల్లె మండల పరిధిలోని 68 అంగన్‌వాడీ కేంద్రాలకు మండల ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, వైఎస్సార్ నాయకులు గాలివీటి విజయసాగర్ రెడ్డిల దాతృత్వంతో ఆట బొమ్మలు, ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. గురువారం మండల కేంద్రంలోని ఆయా కేంద్రాల కార్యకర్తలకు అందజేశారు. కార్యక్రమంలో పెదివీడు సర్పంచ్ నాగిరెడ్డి, ఎంపీడీఓ మల్లీశ్వరి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరస్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అతిథి భోజనం

చిట్వేలి : శ్రీ షిరిడీ సాయి ఆశ్రమం ఎం.వడ్డిపల్లి వారు గురువారం ఎం.గొల్లపల్లె ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు అతిథి భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఈశ్వరయ్య మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఒక పూట మంచి భోజనం వడ్డించినందుకు వారిని అభినందించారు. ఆశ్రమం సభ్యులు మురళీ మాట్లాడుతూ పూజ్య గురువులు అమ్ముల సాంబశివరావు ఆశీస్సులతో అతిథి భోజనం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, జయరామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఓబులవారిపల్లె : చల్లెంపాల్లెం గ్రామానికి చెందిన గూడూరు రాజేష్‌రాజు కొద్దిరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ముక్కా రూపానందరెడ్డి ట్రస్ట్ చైర్మన్ రూ. లక్ష ఆర్థికసాయాన్ని ప్రకటించాడు. గురువారం ముక్కావారిపల్లెలోని ట్రస్ట్ కార్యాలయంలో ముక్కా సాయివికాస్ రెడ్డి, ముక్కా రూపానందరెడ్డి భార్య వరలక్ష్మి రాజేష్ రాజు భార్య పవిత్రకు లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు.

నవరత్నాలతో పేదల జీవన ప్రమాణాలు మెరుగు

- గత ప్రభుత్వానికి వైఎస్ జగన్ ప్రభుత్వానికి తేడా గమనించండి
- గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి



రాజంపేట టౌన్: సంక్షేమ బావుటాను అందిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్‌లు



రాజంపేట: ఎంపీ మిథున్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాజంపేట టౌన్ : పేద ప్రజలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు అమలు చేస్తున్న నవరత్నాల వల్ల పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వారు గురువారం మండలంలోని మందపల్లె, శేషమాంబపురం పంచాయతీల్లోని వివిధ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పేద ప్రజలకు ప్రభుత్వం మంజూరు చేసిన పథకాల కరపత్రాన్ని వారు లబ్ధిదారులకు అందజేసి సీఎం జగన్ చేస్తున్న మేలును వివరించారు. ఒకొక్క కుటుంబానికి చేకూరిన లబ్ధిని లబ్ధిదారులకు తెలియజేసి, ఇంతటి మేలు చేస్తున్న జగన్‌కు వచ్చే ఎన్నికల్లోనూ మద్దతివ్వాలని కోరారు. పలువురు ప్రజలు తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకురాగా వారు ఎంతో ఓపికగా విని వెంటనే పరిష్కరించాలని అక్కడే ఉన్న సంబంధితశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ప్రజలు గత ప్రభుత్వానికి జగన్ ప్రభుత్వానికి తేడాను గమనించాలని కోరారు. గత ప్రభుత్వంలో కేవలం తెలుగుదేశం పార్టీ వారికి, వారి అనుచరులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందేవన్నారు. అయితే జగన్ ప్రభుత్వంలో కులం, మతం, పార్టీలు అన్న తారతమ్యం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఫణి రాజకుమారి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆకేపాటి మురళీరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు దాసరి పెంచలయ్య, హస్తవరం ఉమామహేశ్వర్‌రెడ్డి, దండు గోపి, శ్రీహరి, సుబ్బరాయుడు, హరిబాబు, రెడ్డయ్య, రమణ, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి సహకరించండి

నందలూరు(రాజంపేట) : నూతనంగా నిర్మిస్తున్న కడప - రేణిగుంట హైవే నుంచి నందలూరు బస్టాండు సర్కిల్‌కు అప్రోచ్ రోడ్డు నిర్మించాలని నందలూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు రాజంపేట లోక్‌సభ సభ్యుడు పీవీ మిథున్‌రెడ్డికి విన్నవించారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సమక్షంలో ఆకేపాటి ఎస్టేట్‌లో ఎంపీని నందలూరు వైఎస్సార్‌సీపీ నేతలు కలిశారు. మండల కేంద్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన సౌమ్యనాథ ఆలయం దృష్ట్యా కడప-రేణిగుంట హైవే నుంచి అప్రోచ్ రోడ్డును నిర్మిస్తే యాత్రీకులు, భక్తులు సౌమ్యనాథుడిని దర్శించుకునేందుకు వీలవుతుందన్నారు. అలాగే మూతపడిన ఆల్విన్ కర్మాగారంలో ప్రత్యామ్నాయ పరిశ్రమ ఏర్పాటు చేయాలని వారు కోరారు. నందలూరులో పలు రైళ్ల హాల్టింగ్ జరిగేలా చర్యలు చేపట్టాలని విన్నవించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గడికోట ఉషాసుబ్బారెడ్డి, నందలూరు ఉప సర్పంచ్ ఇబ్బు, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు నడివీధి సుధాకర్, గీతాల నరసింహారెడ్డి, అరిగె హరిబాబు, గుండు మల్లికార్జునరెడ్డి, ఆనాల మధుయాదవ్, భాస్కర్‌యాదవ్, మధురాజులు ఉన్నారు.

పోలా కుమారుడి వివాహ వేడుకలో సజ్జల



వివాహ వేడుకలో పాల్గొన్న సజ్జల, ప్రజాప్రతినిధులు

రాజంపేట టౌన్ : స్థానిక తోట కల్యాణ మండపంలో గురువారం రాత్రి మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి తనయుడు పోలా సాయివైభవ్ రెడ్డి, మైత్రిల వివాహం జరిగింది. వివాహ వేడుకలో ప్రభుత్వ రాజకీయ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య, కడప మేయర్ సురేష్‌బాబు, అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు మేడా మల్లికార్జునరెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, రఘురామిరెడ్డి, రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ చల్లా మధుసూధన్‌రెడ్డిలు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు వివాహ వేడుకలో పాల్గొనడంతో రాజకీయ సందడి కనిపించింది.

నందలూరులో ఏడీఆర్ఎం పర్యటన



రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఏడీఆర్ఎం సుధాకర్

నందలూరు(రాజంపేట) : నందలూరు రైల్వేకేంద్రంలో గురువారం ఏడీఆర్ఎం సుధాకర్ పర్యటించారు. పలు రైల్వే విభాగాలకు చెందిన కార్యాలయాలను సందర్శించారు. రన్నింగ్ స్టాఫ్ క్రూ సెంటర్‌ను తనిఖీ చేశారు. అక్కడ రన్నింగ్ స్టాఫ్ విధులు, రికార్డులను పరిశీలించారు. అలాగే లోకో పైలెట్లు, అసిస్టెంట్ లోకో పైలెట్లు, గార్డులు రెస్ట్ తీసుకునే రన్నింగ్ రూం(నాగిరెడ్డిపల్లె)ను పరిశీలించారు. అక్కడి మౌలిక సదుపాయాలు, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏడీఆర్ఎం వెంట డివిజన్ ఉన్నతాధికారులు, స్థానిక రైల్వేకేంద్రం అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా ఆరాధనోత్సవాలు



అలంకరణలో వెంకయ్యస్వామి మూలవిరాట్

రాజంపేట రూరల్ : మహిమాన్వితుడు శ్రీవెంకయ్యస్వామి 41వ ఆరాధన ఉత్సవాలను ఉమ్మడి జిల్లాలలోని వెంకయ్యస్వామి ఆలయాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి ఆలయాలను నిర్వాహకులు అరటి బోదులు, పూలు, లైట్‌లతో సుందరంగా తీర్చిదిద్దారు. స్వామి వారి మూలవిరాట్‌లను అలంకరించి పూజారులు అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం భక్తులకు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి ఉచితంగా భోజన వసతి కల్పించారు. అదే విధంగా స్వామి వారి మూల మంత్రమైన 'ఓం నారాయణ.. ఆది నారాయణ' మంత్రాన్ని భక్తులు భజన రూపంలో గంటల కొద్ది జపించారు. వేడుకలలో మహిళలు, భక్తులు, వెంకయ్యస్వామి మాలదారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు

చిన్నమండెం : మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో ఈ నెల 26వ తేదీ నుంచి నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 26, 27 తేదీలలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించనున్నారు. 28న విగ్రహ ప్రతిష్ట, ప్రాణప్రతిష్ట, యంత్ర ప్రతిష్ట, కళాన్యాసం, ధ్వజప్రతిష్ట, జ్వాలా దర్శనం తదితర కార్యక్రమాలతోపాటు ఉదయం 11.30 నుంచి 12.30 గంటలోపు సీతారామ కల్యాణం, అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటాయన్నారు. ప్రతిష్టాపనోత్సవాలలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

ఇంటింటి వెరిఫికేషన్‌ను పూర్తి చేయండి

రాజంపేట ఆర్డీఓ రామకృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామకృష్ణారెడ్డి

రాజంపేట : ఓటర్ల నమోదు, మార్పు, చేర్పుల ప్రక్రియలో భాగంగా ఇంటింటి వెరిఫికేషన్‌ను గడువులోగా పూర్తి చేయాలని రాజంపేట రెవిన్యూ డివిజనల్ అధికారి రామకృష్ణారెడ్డి అధికారులకు ఆదేశించారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలోని సభా భవనంలో ఓటర్ల నమోదు, గుర్తింపు, తొలగింపులు, చేర్పులు తదితర అంశాలకు సంబంధించి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఈఆర్‌ఓ, సూపర్‌వైజర్లు ఇంటింటి వెరిఫికేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇప్పటికే అనేక మార్లు సమీక్ష నిర్వహించుకున్నామన్నారు. ఎన్నికల సంఘం నుంచి ఆదేశాలను కచ్చితంగా పాటించాలన్నారు. రాజకీయ పార్టీల నుంచి వచ్చిన అభ్యంతరాలను కూడా పరిశీలించాలన్నారు. సమావేశంలో ఆరు మండలాల తహసీల్దారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పగలే వెన్నల కాంతులు

రామాపురం : మండలంలోని 13 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన వీధి దీపాలు పగలే వెన్నెల అనుచందంగా వెలుగుతున్నాయి. మండలంలో దశాబ్దాల కాలంగా కేంద్ర ప్రభుత్వం దీన్ దయాల్ పథకం కింద గ్రామాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేశారు. కానీ వీటికి ఆఫ్ చేసే స్విచ్ లేకపోవడంతో నిరంతరంగా వీధి దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. పగటి పూట వెలుగుతుండటంతో కరెంటు భారం ప్రజలపై ఉందని గ్రామస్తులు తెలుపుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, మండల వ్యాప్తంగా 20 వేలు పైగా దీపాలు గ్రామాల్లో ఏర్పాటు చేశారని అధికార గణాంకాలు చెబుతున్నాయి. కానీ జగనన్న కాలనీలలో ఎలాంటి వీధి దీపాలు లేక చీకటిలో మగ్గుతున్నామని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు జగనన్న కాలనీలో వీధి దీపాలు, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని పలువురు జగనన్న కాలనీలోని ఇళ్ల లబ్ధిదారులు కోరుతున్నారు.

ఎస్సీ, ఎస్టీలకు భూ పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ నేత నరసింహులు

ఓబులవారిపల్లె : నిరుపేద ఎస్సీ, ఎస్టీలకు భూ పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సీఎల్ నరసింహులు పేర్కొన్నారు. మండలంలోని బాలిరెడ్డిపల్లె రెవెన్యూ పరిధిలోని భూములను స్థానికంగా అనుభవంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు భూములివ్వాలని ఆయన కోరారు. గురువారం బాలిరెడ్డిపల్లె గ్రామంలో సీపీఐ, సీపీఎం నాయకులు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ రెవెన్యూ పరిధిలో దాదాపు 120 ఎకరాల్లో స్థానిక ఎస్సీ, ఎస్టీ పేద కుటుంబాలకు భూ పంపిణీలో భూములివ్వాలన్నారు. అదే విధంగా మండలంలోని భూములు లేని మైనార్టీ, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు భూ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జయరామయ్య, సీపీఐ మండల కార్యదర్శి చింతపూడి నాగమ్మ, కార్యవర్గ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రక్షక తడితో వేరుశనగను రక్షించుకుందాం

గాలివీడు : వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వేరుశనగ పంట ఎండిపోకుండా రక్షక తడితో నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి మురళీధర్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో మాట్లాడుతూ 2023 సంవత్సరం ఖరీఫ్‌లో వర్షాధారిత, బోర్ల కింద సాగు చేసిన వేరుశనగ పంట చివరి దశలో ఉందని, ఇలాంటి తరుణంలో వర్షాలు ముఖం చాటేయడంతో పంట చేతికందుతుందో లేదో అన్న అభద్రతా భావంతో రైతులు కంగారు పడుతున్నారని గ్రామ వ్యవసాయ సహాయకులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. వ్యవసాయ శాఖ సూచనల మేరకు వేరుశనగ పంట ఎండిపోకుండా నివారణ చర్యల్లో భాగంగా 200 లీటర్ల నీటిలో 4 కేజీల యూరియా కలుపుకొని పిచికారీ చేయడం ద్వారా 10 నుంచి 15 రోజుల పాటు పంట కాపాడుకోవచ్చునన్నారు. అంతేగాక అందుబాటులో ఉన్న నీటి ట్యాంకర్లతో రక్షక తడితో పంటలను కాపాడుకోవాల్సిందిగా సూచించారు.

యూరియా ద్రావణం పిచికారీ చేసి కాపాడుకోండి

రాయచోటి టౌన్ : వర్షాభావ పరిస్థితిల వలన ఎండుతున్న వేరుశనగ పంటను కాపాడుకొనేందుకు యూరియా ద్రావణాన్ని పిచికారీ చేసి మరో పది రోజులు పంటను కాపాడుకోవచ్చునని రాయచోటి ఏఓ దివాకర్ రైతులకు సూచించారు. వర్షాధారంగా వేరుశనగ పంటను సాగు చేసి పంటలను పరిశీలనలో భాగంగా గురువారం శిబ్యాల గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా తొగటపల్లెకు చెందిన రెడ్డెయ్య రాజు సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించారు. వర్షాభావ పరిస్థితులలో ఎండుతున్న వేరుశనగ పంటకు లీటర్ నీటికి 20 గ్రాముల యూరియాను కలపి పిచికారీ చేయించారు. ఇలా చేయడం వలన కనీసం 7 నుంచి 10 రోజుల వరకు కాపాడుకోచ్చుని సూచించారు.

నేడు నల్లగంగమ్మ ఆలయంలో వరలక్ష్మి వ్రతం

సంబేపల్లె : దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్మాణ కర్త మునగా మురళీస్వామి, ఈఓ కొండారెడ్డి, అర్చకులు గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు వరలక్ష్మి వ్రతం ప్రారంభమవుతుందని, వ్రతానికి వచ్చే భక్తులు తమ వెంట పూజా సామగ్రిని తీసుకురావాలన్నారు. ఆలయం తరపున పసుపు కుంకుమ, రవిక బట్ట, గాజులు అందించడం జరుగుతుందని తెలిపారు.

వరలక్ష్మి వ్రతానికి కావాల్సిన పూజా సామగ్రి

గంధం, విడి పూలు, పూలమాలలు, తమలపాకులు, కలశం చంబు, ప్లేట్లు, వక్కలు, ఖర్జూరాలు, అగరబత్తులు, కర్పూరం, చిల్లర పైసలు, తెల్లని వస్త్రం, పండ్లు, కొబ్బరికాయలు, తెల్లదారం లేదా నోముదారం లేదా పసుపు రాసిన కంకణం, నైవేధ్యాలు, బియ్యం, దీపం వత్తులు, నెయ్యిలను వెంట తెచ్చుకోవాలి.

వర్షం కోసం మైనార్టీల ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థనల అనంతరం అన్నదానం చేస్తున్న ఎస్ఐ రఫీ

రాయచోటి అర్బన్ : వర్షాలు కురిసి రైతులతోపాటు అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ మైనార్టీ సోదరులు గురువారం పట్టణంలోని నాలుగురోడ్ల కూడలి (ఠాణా)వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మధ్యాహ్నం ఠాణా వద్ద ఉన్న జామియా మసీదు వద్ద చేసిన ప్రార్థనల్లో ముస్లిం, మైనార్టీలు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ ఎస్ఎండీ రఫీ, మైనార్టీ నేతలు చెన్నూరు అన్వర్‌బాషా, మహబూబ్‌బాషా, జిన్నా షరీఫ్, వతన్ నిస్సార్, ముబారక్‌బాషా, వతన్‌సలీం, తాలిబ్, మస్తాన్, ఎంహెచ్‌పీఎస్ నేత సగీర్, ఇందాద్, మౌలానా, మూసా, ఫజల్, అమీర్‌జాన్‌తో పాటు పెద్దసంఖ్యలో మైనార్టీలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లి/గాలివీడు : లక్కిరెడ్డిపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని రామాపురం మండలంలోని గోపనపల్లి గ్రామంలో అంగన్‌వాడీ వర్కర్, అలాగే కుమ్మరపల్లి గ్రామంలో ఆయా పోస్టు, గాలివీడు మండలం నూలివీడు ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని, దరఖాస్తులు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ, అధికారులు గురువారం తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్, ఆయా పోస్టులకు స్థానికులై ఉండాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్ 10వ తరగతి పాసై ఉండాలని, ఆయా పోస్టుకు 7వ తరగతి పాసై ఉండాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 31వ తేదీలోపు లక్కిరెడ్డిపల్లి ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని వారు తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సంబేపల్లె : మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లె పంచాయతీ జగనన్న కాలనీలో గురువారం జిల్లా వైద్య బృందం పర్యటించింది. ఈ సందర్భంగా కాలనీలో డెంగ్యూ, మలేరియా ప్రబలకుండా జాగ్రత్త పడాలని వైద్య బృందం సభ్యులు సూచించారు. ముఖ్యంగా నీటి నిల్వ ఉండే ప్రదేశాలను ప్రతి శుక్రవారం శుభ్రం చేయాలన్నారు. సీజనల్ వ్యాధులపై తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు.

• చంద్రయాన్-3 విజయోత్సవ సంబరాలు

అంతరిక్ష పరిశోధనల్లో చంద్రయాన్ విజయం భారతదేశ కీర్తి పతాకాన్ని ప్రపంచ స్థాయిలో రెపరెపలాడేలా చేసింది. బుధవారం చంద్రయాన్-3 విజయవంతంగా చంద్రుడి దక్షిణ ధృవంపై దింపిన మొదటి దేశంగా చరిత్ర సృష్టించింది. ఈ విజయాన్ని పురస్కరించుకొని అన్ని ప్రాంతాల్లో విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. విద్యార్థులు ర్యాలీలో పాల్గొని జయహో భారత్, మేరా భారత్ మహాన్ అంటూ నినాదాలు చేశారు. పలువురు ప్రముఖులు చంద్రయాన్-3 విజయానికి దోహదపడిన శాస్త్రవేత్తల సేవలను కొనియాడారు. శాస్త్ర, సాంకేతిక రంగంలో భారత్‌దేశ గొప్పతనం ప్రపంచానికి ఈ విజయంతో మరింత పెంచిందన్నారు. - సాక్షి నెట్‌వర్క్



రాయచోటి అర్బన్ : ర్యాలీలో పాల్గొన్న సాయి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు



సిద్దవటం : బెటాలియన్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



సంబేపల్లె : ర్యాలీ చేపట్టిన విద్యార్థులు, ప్రముఖులు



రాయచోటి టౌన్ : మానవ సంస్థ సభ్యులు, విద్యార్థుల విజయోత్సవ ర్యాలీ